'ఓరి! నువ్వా?—'

'అవును నాన్నా....'

'టెలిఫోన్ చెయ్యకుండావచ్చావేం?'

'ఆఁ.... చేసే దేమిటి అని....'

'వీ రెవరు?'

'లలిత-బి.ఏ. చదువుతోంది నాన్నా..

'ఏమండీ! యీ హోటల్లో శ్యామసుందర్ అనే సినీ నటుడు ఉంటున్నాడు కదూ—'

(బోయ్ సీసాతో ప్రవేశం)

'బోయ్! శ్యామసుందర్ అనే సినీ నటుడు ఈ హోటల్లో ఏ గదిలో ఉంటారు?'

'ఈ హోటల్లో ఎవరూ లేరండీ? ....ఈయనే శ్యామసుందర్!'

'ఆఁ' శకుంతల ఆశ్చర్యంగా శ్యామసుందర్ వైపు చూసింది!

'నువ్వేనా శకుంతల?'

'అవునండీ—కాని నా అసలు పేరు లలిత—'

'సరదాగా టెలిఫోనులో శకుంతల అనే పేరుతో మాట్లాడతా'

'బలేతమాషా!—'

'మీ కంటేనా? సినీ నటుడని నటించారే!'

'అదేమిటి నాన్నా?'

'అదో కథరా—చెబుతా..ఈ అమ్మాయితో పరిచయం ఎలా?'

'నేనంటే యిష్టం!'

'కథలురాసే విశ్వం గురించి అబద్ధాలాడేది!....యీయనేనా?'

'ఏరా నువ్వు కథలు రాస్తావా?'

'లేదు నాన్నా! ఈఅమ్మాయికి విశ్వం అంటే యిష్టమని తెలిసి, నా పేరూ అదేగా – నేనే ఆ రచయిత నన్నాను!'

'నువ్వు విశ్వం కాదూ!' కోపంతో లేచింది లలిత—

'నన్ను క్షమించు లలితా!'

'ఈవేళ మా యింట్లో టీపార్టీ లేదు. క్షమించండి-మీ యిద్దరూ రానక్కర్లేదు'

లలిత నిష్క్రమణ కోపంతో.

విశ్వం పాలిపోయిన ముఖంతో వెంటనే బయటికి నడిచాడు, తండ్రికేసి భయంగా చూస్తూ.

శ్యామసుందర్ నవ్వుకున్నాడు..... బీర్ గ్లాసు చూసి, త్రాగుతూ—

టక్ టక్ టక్ గుఱ్ఱపు డెక్కల చప్పుడు! బొంబాయిలో!

'బోయ్! బొంబాయికి సాయంత్రం బండిలో ఒకటిక్కట్టు ఫస్టుక్లాసు బుక్ చెయ్యి!' శ్యామసుందర్ అలసటగా నీల్గాడు...

సిసాలు ఖాళీ...గ్లాసులు ఒరిగాయి—టెలిఫోను గాలిలో తిరుగుతోంది—శకుంతల కదులుతోంది—శకుంతల కాని లలిత—విశ్వం కాని విశ్వం—శ్యామసుందర్ కాని శ్యామసుందర్!—

మనిషికాని మనిషిని

టెలిఫోను సాధించింది!

'లోకంతీరు!!—బోయ్!'—తూలుతూ ప్రక్కమీద ఒరిగాడు శ్యామసుందర్!*

# ఎవరి పని?



దస్తూరి మేస్టరు సెర్గెయ్ కసితోనిచ్ అఖీనియెవ్ తన కుమార్తె నతాల్యను హిస్టరీ, జాగ్రఫీల మేస్టరయిన ఇవాన్ పెత్రోవిచ్ లొషాదినిఖ్ కిచ్చి చేశాడు. పెళ్లి విందు దివ్యంగా జరిగింది. ఆడారు, పాడారు, హాలులో నృత్యాలు చేశారు. ఈ అక్కరకుగాను క్లబ్బునుంచి అరువు తెచ్చిన వెయిటర్లు నల్ల ఫ్రాక్ కోటులూ, మాసిపోయిన తెల్ల నెక్‌టైలూ ధరించి, వెర్రివాళ్లలాగా అటూఇటూ హడావుడిగా తిరిగారు. మాటల సందడి అంతటా మారుమోగిపోయింది. బయట కొందరు జనం మూగి కిటికీలగుండా లోపలికి చూశారు; వాళ్లకి లోపలికి వచ్చే అర్హత లేదు.

సరిగా అర్ధరాత్రి సమయాన పెళ్లిపెద్ద అఖీనియెవ్ ఆఖరు భోజనానికి ఏర్పాట్లన్నీ సవ్యంగా జరిగాయో లేదో చూడటాని కని వంటసాలకు వెళ్లాడు. వంటసాల పైనుంచి కిందికి పొగతో నిండి ఉన్నది. ఆ పొగలో బాతుల వాసనా, పొట్టి బాతుల వాసనా, ఇంకా అనేక వాసనలూ ఉన్నాయి. రెండు బల్లలమీద తిండి పదార్థాలూ, పానీయాలూ అడ్డదిడ్డంగా పేర్చిపెట్టినా కనుల పండువుగా ఉన్నాయి. వంటమనిషి మార్ఫా లావుపాటిది. ఆమె మొహం ఎర్రగా ఉంటుంది. ఆమె ఆ బల్లలమీద ఏదో అమర్చుతున్నది.

అఖీనియెవ్ చేతులు రుద్దుకుంటూ, పెదవులు నాక్కుంటూ, "ఏదీ, స్టర్జిన్ చేప చూపవే! ఎంత కమ్మని వాసన! వంటఇల్లంతా తినెయ్యా లనిపిస్తున్నది! సరేగాని, స్టర్జిన్ చూపూ!" అన్నాడు.

మార్ఫా ఒక బెంచీవద్దకువెళ్లి, నూనె మరకలతో ఉన్న ఒక కాగితం ఎత్తింది. ఆ పత్రికకాగితంకింద పెద్ద పళ్ళెంలో ఒక పెద్ద, కొవ్విన స్టర్జిన్ చేప ఉన్నది. దాని చుట్టూ మసాలాకింద కాయలూ, దుంపలూ అమర్చి ఉన్నాయి. అఖీనియెవ్

అంతోన్ పి. చెఖవ్

స్టర్జిన్‌ను చూసి తృప్తిగా పెద్ద నిశ్వాసం విడిచాడు. అతను వంగి పెదవులతో చప్పుడు చేసి, బండి చక్రం కిరకిరలాటి ధ్వని తెప్పించాడు. కొంచెం ఆగి సంతోషంతో చిటికెలు వేస్తూ మళ్ళీ పెదవులతో ధ్వని చేశాడు.

"ఓహో, మంచి రసవంతమైన ముద్దు! ఎవరిని ముద్దుపెట్టుకుంటున్నావు, మార్ఫుష్క ?" అంటూ పక్కగది నుంచి ఎవరో అనటం వినిపించింది. త్వరలోనే, అంటకత్తిరించిన వాన్కిన్ తల తలుపుదగ్గిర కానవచ్చింది. అతను బడిలో అసిస్టెంటు ఉపాధ్యాయుడు. "ఇక్కడ ఎవరిని ముద్దు పెట్టుకుంటున్నావు ? ఓ-హో-! భేష్, సెర్గెయ్ కపితోనిచ్ ! మంచి ముసలాయనే ! ఒంటరిగా ఆడదానితో !"

"నే నసలు ముద్దే పెట్టుకోవటం లేదు," అన్నాడు అఖీనియెవ్ కంగారుగా. "పెట్టుకున్నావని ఎవరన్నారు, మూఢుడా ! చేపను చూసిన సంతోషంలో నా పెదవులు అప్పళించాను అంతే !"

"ఈ కబుర్లు నేనా నమ్మేది?" అంటూ వాన్కిన్ విశాలంగా నవ్వి, తలుపు అవతలికి వెళ్ళిపోయాడు. అఖీనియెవ్ జేవురించాడు.

"ఇది ఎక్కడిదాకా పోతుందో ఏమిటో ?" అనుకున్నా డాయన. "ఈ వెధవ వెళ్ళి అందరితోటీ చెప్పేస్తాడు. ఊరంతటా నన్ను నవ్వులపాలు చేస్తాడు, పశువు !"

అఖీనియెవ్ పిల్లిలాగా హాలులో ప్రవేశించి వాన్కిన్ ఏం చేస్తున్నాడోనని దొంగ చూపులు చూశాడు. వాన్కిన్ పియానోపక్క నిలబడి, వంగి, ఇన్‌స్పెక్టరు వదినెగారితో ఏదో రహస్యంగా చెబుతున్నాడు. ఆమె నవ్వుతున్నది.

"నన్నుగురించే !" అనుకున్నాడు అఖీనియెవ్. "నన్నుగురించే, వీడి కడుపుడక ! వాడి మాటలు ఆమె నమ్ముతున్నది, నవ్వుతున్నది. హారి దేవుడా ! ఈ వ్యవహారాన్ని ఇలా వదిలిపెట్టేసి ఊరుకుంటే లాభంలేదు. ఉఁ హుఁ ! వీడి మాటలు ఎవ్వడూ నమ్మకుండా చెయ్యాలి. నేను అందరితోనూ మాట్లాడి, చిట్టచివరకి వీడు వట్టి పోచుకోలు రాయడని తేలేలాగు చేస్తాను."

అఖీనియెవ్ బుర్ర గోక్కుని, ఇంకా అయోమయంలో ఉంటూనే, పదెకోయ్‌ని సమీపించాడు.

"ఇందాక నేను వంటసాలలో ఉండి భోజనాల ఏర్పాట్లూ అవీ చూస్తున్నానూ," అన్నాడాయన ఆ ఫ్రెంచి మనిషితో. "మీకు చేపలంటే ఇష్టం, నే నెరుగుదు. ఇంత పొడుగు స్టర్జిన్ చేప ఉంది. దాదాపు రెండు గజాల పొడుగు. ఆహా హా ! అయిందా, అన్నట్టు చెప్పటం మరిచేపోయాను. ఆ స్టర్జిన్ గురించి ఒక చిన్న గమ్మత్తు జరిగింది. ఇంతకుముందే నేను వంటసాలకు తిండి విషయం చూదాం గదా అని వెళ్లాను. స్టర్జిన్ చేపను చూసి





ఆనందం పట్టలేక పెదవులు అప్పళించాను — అది అంత నోరూరేలాగుంది! సరిగా ఆ సమయానికే ఆ బడుద్ధాయి వాన్కిన్, 'ఓ హో హో ! ఆహాఁ ! ఇక్కడ మీరు ముద్దుపెట్టుకుంటున్నారే!' అన్నాడు. మార్ఫానుట ! అది వంట మనిషండీ ! వాడికి ఆపాటి బుర్రకూడా లేదేం ! ఆ ముండ వికారంగా ఉంటుంది, వట్టి కోతి. వీడేమో మేం ముద్దు పెట్టుకుంటున్నా మని ! ఎలాటి అభాజనుడో !"

"ఎవరా అభాజనుడు ?" అంటూ తారంతూలవ్ వారిని సమీపించాడు.

"వాన్కిన్ మాటే చెబుతున్నాను. నే నలా వంటసాలకేసి వెళ్లాను—"

మళ్ళీ మార్ఫా గురించి, స్టర్జిన్ చేప గురించీ ఏకరువు పెట్టాడు.

"నా కందుకు నవ్వొస్తోంది. ఎంత మతిమాలినవాడంట ! నా ఉద్దేశం చెప్పమన్నారూ ? మార్ఫాను ముద్దు పెట్టుకోవటంకన్న ఏ కుక్కనో ముద్దుపెట్టుకుంటే బాగుంటుంది," అంటూ అఖీనియెవ్ పక్కకు తిరిగి మజ్దాను చూశాడు.

"మేం వాన్కిన్ గురించి మాట్లాడుకుంటున్నాం," అన్నాడాయన. "ఏం వింతమనిషి అనుకున్నారు ! వంటసాలలోకి వచ్చి నేను మార్ఫా పక్కన నిలబడిఉండటం చూసి వెంటనే కథలు అల్లసాగాడు. 'ఏమిటీ ? మీ రిద్దరూ ముద్దులాడుతున్నారా ?' అని అడిగాడు.



తాగివున్నాడులెండి, కలలు కన్నాడు కామాలు. నే నేమన్నానో తెలుసా? 'మార్ఫాను ముద్దుపెట్టుకునేకన్న పొట్టి బాతును ముద్దాడటం నయం. నాకు భార్య వున్నదోయ్, మూఢుడా,' అన్నా. నా మానం నిలువునా తీశా డంతే!"

"ఎవరు మీ మానం తీసిందీ?" అని మత పాఠాలు చెప్పే పంతులు అఖీనియెవ్‌ను అడిగాడు.

"వాన్కిన్. నేను వంటసాలలో నిలబడి స్టర్జిన్‌చేపను చూస్తున్నాను—"

ఇలాగే సాగింది. ఒక అరగంటలోపల అతిథు లందరికీ వాన్కిన్ గురించీ, స్టర్జిన్‌చేపగురించీ తెలిసిపోయింది.

"ఇహ చెప్పుకోమను!" అనుకున్నాడు అఖీనియెవ్ చేతులు రుద్దుకుంటూ. "ఏంచేస్తాడో చేసుకోనీ. వాడు మాట్లాడనారంభించగానే వాళ్లు వాణ్ణి ఆగమని, 'వెర్రిగా మాట్లాడకోయ్! మా కంతా తెలుసులే,' అంటారు.

అఖీనియెవ్‌కు ఎంత సంతృప్తి కలిగిందంటే అతను తాను మామూలుగా తాగేకన్న మరినాలుగు గ్లాసుల బ్రాందీ అధికంగా తాగాడు. ఆయన తన కుమార్తెను పడకగది దగ్గిర దిగవిడిచి, తన గదికి పోయి అమాయక శిశువులాగా గాఢ నిద్రపోయాడు. మర్నా డాయనకు స్టర్జిన్ విషయం ఏమీ జ్ఞాపకంకూడా లేదు. కాని, మనిషి ఒకటి తలపెడితే, దైవం ఇంకొకటి తలపెడతాడు. అవాచ్యాలు పలికేనోరు అపకారం చేసే తీరుతుంది. అఖీనియెవ్ చాతుర్యం ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఒక వారం అవతల, బుధవారంనాడు, మూడో పీరియడ్ అనంతరం, అఖీనియెవ్ మేస్టర్ల గదిలో నిలబడి విస్యేకిన్ అనే రాలుగాయి విద్యార్థి దుర్బుద్ధి గురించి ప్రసంగిస్తూండగా, డైరెక్టరుగారు వచ్చి ఆయనను పిలిచి అవతలికి తీసుకుపోయాడు.

'చూడండి, సెర్గెయ్ కపితోనిచ్,' అన్నాడు డైరెక్టరు. "మరోలా అనుకోవద్దు. నాకు సంబంధించిన విషయం కాదనుకోండి, అయినా నే నొకటి మీకు స్పష్టం చెయ్యాలి. నా విధి—ఏమంటే, మీకూ, ఆ మనిషికీ——మీ వంటక్కకూ—సంబంధం ఉన్నట్టు వదంతిగా వుంది. నా విషయం కాదనుకోండి, అయినా—మీరు కావలిస్తే ఆ మనిషితో పొండి, ఆమెను ముద్దుపెట్టుకోండి—మీ ఇష్టం వచ్చినట్టు చెయ్యండి, కాని దయచేసి బహిరంగంగా చెయ్యకండి!'ఇది నా విజ్ఞాపన. మీరు బడిపంతు లని మరిచిపోవద్దు!'

అఖీనియెవ్ బిగుసుకుని శిల అయిపోయినట్టుగా నిలబడ్డాడు. ఒక తేనెటీగల దండు చెడకుట్టేసి, మీద ఉడుకు నీళ్ళు పోసినవాడిలాగా అయిపోయి ఆయన ఇంటికి వెళ్ళాడు. దారిలో పట్న





మంతా, తనకెవరో తారు పులిమినట్టుగా తనకేసి చూస్తున్నట్టు ఆయనకు తోచింది. ఇంటివద్ద కొత్త కష్టాలు ఆయనకోసం కాచుకున్నాయి.

భోజనాల దగ్గిర ఆయన భార్య, "ఏదీ తినవేం? దేన్ని గురించి ఆ ఆలోచన? మన్మధుడు తలలో మెదులుతున్నాడేం? మార్ఫా షాకావాలిలాగుంది. నా కంతా తెలిసిందిలే, మహమ్మదూ, నే నంటే అభిమానం గలవాళ్ళు నా కళ్ళు తెరిచారులే, పశువా!"

ఆవిడ ఆయన చెంపమీద ఛళ్లున కొట్టింది.

ఆయన భోజనాల బల్లవద్ద నుంచి లేచి, టోపీగాని, కోటుగాని తీసుకోకుండా, తూలుతూ వాన్కిన్ ఇంటికి వెళ్ళాడు. వాన్కిన్ ఇంటోనే వున్నాడు.

"నీచుడా, నాపైన ప్రపంచందృష్టిలో ఈ బురద ఎందుకు చల్లావు? నాపైన ఈ అపవాదు ఎందుకువేశావు?" అన్నాడాయన వాన్కిన్‌తో.

"ఏమిటి? ఏ అపవాదు? మీరు ఏం మాట్లాడుతున్నారు?"

"నేను మార్ఫాను ముద్దుపెట్టుకున్నానని అందరితోటీ చెప్పినది ఎవరు? నువు కాదేమోగాదూ? నువేకాదా—హంతకుడా!"

వాన్కిన్ బిత్తరబోయి కళ్ళార్పాడు. అతని ముఖ మంతా అదురుతున్నది. అతడి విగ్రహంకేసి చూస్తూ, ''నేను మిమ్మల్ని గురించి ఎవరితోగాని ఒక్కమాట అని వుంటే దేవుడు నన్ను అణచాలి. నా కళ్ళు పోవాలి, నేను చావాలి! నాకు ఇల్లూ వాకిలీ లేకుండా పోవాలి!" అన్నాడు.

వాన్కిన్ నిర్దోషి అన్నది స్పష్టమయింది. పుకారు లేవదీసింది అతను మాత్రం కాడు.

"అయితే మరి ఎవరైనట్టు? ఎవరై ఉంటారు?" అని రొమ్ము బాదుకుంటూ అఖీనియెవ్ తాను ఎరిగినవారి నందరినీ జ్ఞాపకం చేసుకున్నాడు. ''ఇది ఎవరి పని?"

